సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 19 । జనవరి । 2024



ఇస్కాన్‌కు జయద్వైత స్వామి
సనాతన ధర్మాన్ని ప్రబోధించడానికి గురువారం సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌కు జయద్వైత స్వామి మహారాజ్‌కు చేరుకున్నారు. 8లో



అభివృద్ధి పథంలో కేజీహెచ్
ఆరోగ్య ప్రధాయిని కేజీహెచ్ ప్రగతి పథంలో పయనిస్తోంది. ఎన్నడూలేని విధంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. 8లో



27న రైతు బజార్‌లో డ్రా
రైతుబజార్ స్టాళ్ల కోసం ఈ నెల 27వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

మిలాన్‌కు పటిష్ట భద్రత



మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: నావికాదళం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లలో బీచ్ రోడ్డులో నిర్వహించనున్న మిలాన్-2024కు పటిష్ట భద్రతా చర్యలు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో నేవీ, పోలీస్ ఉన్నతాధికారులతో సీపీ సమావేశం నిర్వహించారు. మిలాన్‌కు ఇతర దేశాల నుంచి పలువురు ప్రముఖులు, ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పలువురు వీవీఐపీ, వీఐపీలు వచ్చే అవకాశం ఉండడంతో వారి పర్యటన, సభా ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ సౌకర్యాలు, అధికారులు, సిబ్బందికి వసతి ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైమ్) పల్లా వెంకటరత్నం, నేవీ ఉన్నతాధికారులు, ట్రాఫిక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

4,169 మందికి వైద్య సేవలు



కార్పొరేటర్ బట్టు సూర్యకుమారికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా గురువారం అర్బన్‌లోని 10 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. స్వతంత్ర నగర్-1, సాగర్‌నగర్-2, పాత వెంకోజీపాలెం, రంగిరాజువీధి, జబ్బరితోట, నరసింహనగర్, నక్కవానిపాలెం, నమ్మిదొడ్డి, న్యూ గాజువాక, చినముషిడివాడలో జరిగిన శిబిరాల్లో 4,169 మందికి వైద్య సేవలందించారు. ఇందులో 12 కేసులను ఆరోగ్యశ్రీలో రిఫరల్ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. శొంఠ్యాం పీహెచ్‌సీ పరిధిలో చింతగట్ల గ్రామ సచివాలయం, భీమిలి మండలం రాజుల తాళ్లవలస(ఆర్టీ వలస) పీహెచ్‌సీ పరిధి కొరడా సచివాలయంలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో వెల్లడించారు.

ముగ్గురు సీఐలకు స్థానచలనం

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు కల్పించగా.. ఒకరికి స్థాన చలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం జిల్లా నుంచి వచ్చిన టి.వి.తిరుపతిరావును ఆనందపురం లా అండ్ ఆర్డర్‌కు, విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న సిహెచ్.శ్రీధర్‌ను పద్మనాభం లా అండ్ ఆర్డర్ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. పద్మనాభం లా అండ్ ఆర్డర్ సీఐగా ఉన్న ఎస్.సన్యాసినాయుడును బదిలీ చేస్తూ సీపీకి రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సేవలు

ఏయూక్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని యూఈబీ జీబీ డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు ఓ ప్రకటనలో తెలిపారు. www.employment.ap.gov.in ద్వారా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అప్‌డేషన్ తదితర సేవలను పొందవచ్చని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని సూచించారు.

మానసిక ఆస్పత్రిలో పలు ఉద్యోగాల భర్తీ

దరఖాస్తుకు 20వ తేదీ గడువు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో కాంట్రాక్ట్ విధానంలో పలు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ ఆదేశాలను అనుసరించి చైల్డ్ సైకాలజిస్టులు-2, సైకో సోషల్ వర్కర్, స్పీచ్ థెరపిస్ట్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, స్పీచ్ ఎడ్యుకేటర్ ఉద్యోగాలు ఒక్కొక్కటి చొప్పున భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలు, దరఖాస్తుల కోసం https://visakhapatnam.ap.gov.in/documents/ ను సందర్శించాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత, వృత్తిపరమైన అనుభవాన్ని తెలియజేసే సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జతచేయాలని సూచించారు.

ఉత్తరాంధ్ర నుంచే తొలి అడుగు

- 175 స్థానాల్లో గెలుపే లక్ష్యం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ
- 25న భీమిలిలో బహిరంగ సభ
- సభ నిర్వహణపై పార్టీ ముఖ్యనేతలతో సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, ధర్మాన కృష్ణదాస్, పార్టీ ముఖ్యనాయకులు

సాక్షి, విశాఖపట్నం : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం పూరించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఈ నెల 25న భీమిలిలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ సభ నిర్వహణపై ఎండాడలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన ఉత్తరాంధ్ర జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్య నేతలతో గురువారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచే వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభకానుందని, ఇందులో భాగంగా భీమిలిలో నిర్వహించే భారీ బహిరంగ సభ దద్దరిల్లాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, నాయకులు సభకు తరలిరావాలన్నారు. ఈ సభలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్రలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు వివరిస్తారన్నారు.

ఉత్తరాంధ్రపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా విభజించామని.. సీఎం జగన్ అధ్యక్షతన అన్ని జోన్లలో కేడర్‌తో సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. వచ్చే ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఈ భేటీలు జరుగుతాయని వెల్లడించారు. తొలి బహిరంగ సభ ద్వారా ఉత్తరాంధ్ర కార్యకర్తలు, అభిమానులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తారన్నారు. ఉత్తరాంధ్రపై సీఎం జగన్‌కు ప్రత్యేక శ్రద్ధ ఉందని, అందుకే ఈ ప్రాంతం నుంచి ఎన్నికల శంఖారావం పూరిస్తున్నట్లు వివరించారు. ఎవరికి ఎమ్మెల్యే.. ఎవరికి ఎంపీ టికెట్ ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయిస్తారని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు.

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, ఇందుకూరి రఘురామరాజు, సురేష్‌బాబు, పార్టీ జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, ధర్మాన కృష్ణదాస్, పరీక్షిత్‌రాజు, చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొర్లె కిరణ్‌కుమార్, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బడుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, విశ్వసరాయి కళావతి, పాముల పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు, వాసుపల్లి గణేష్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, కె.భాగ్యలక్ష్మి, తిప్పల నాగిరెడ్డి, గొల్ల బాబూరావు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఇన్‌చార్జిలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, పిరియా విజయ, డాక్టర్ తాలే రాజేష్, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఉరుకూటి రామచంద్రరావు, మలసాల భరత్‌కుమార్, ముఖ్య నాయకులు సుకుమార్‌వర్మ, ఈర్లె అనురాధ, తమ్మినేని చిరంజీవి, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

హార్బర్‌లో నో స్మోకింగ్!

- గృహ వినియోగ సిలిండర్లకు అనుమతి లేదు
- వేటకు వెళ్లే ముందే బోట్లలో డీజిల్ నింపాలి
- పర్యవేక్షణకు సాగరమిత్రల నియామకం
- ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంతో అప్రమత్తం



సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో పొగ తాగడాన్ని నిషేధించారు. నవంబర్ 19 అర్ధరాత్రి హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 38 బోట్లు పూర్తిగాను, 18 బోట్లు పాక్షికంగాను దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చేపలరేవులో మున్ముందు అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం ఈ హార్బర్‌లో ఇకపై ఎవరూ పొగతాగడానికి వీల్లేదు. అగ్ని ప్రమాదాలకు అవకాశం ఉన్నందున బోట్లలో డీజిల్, గ్యాస్ నిల్వ ఉంచరాదని స్పష్టం చేసింది. ఇన్నాళ్లూ వేటకెళ్లే బోట్లలో చాలామంది బోటు యజమానులు గృహ వినియోగ (డొమెస్టిక్) సిలిండర్లను వంట కోసం తీసుకెళ్తున్నారు. ఇకపై వాటిని అనుమతించరు. ఈ పెద్ద గ్యాస్ సిలిండర్లకు బదులు రీఫిల్లింగ్‌కు వీలయ్యే చిన్న సిలిండర్లను మాత్రమే వాడాలని మత్స్యశాఖ నిర్దేశించింది. వేటకెళ్లే సమయంలోనే బోట్లలో డీజిల్ నింపుకోవాలని, లంగరు వేసిన బోట్ల ట్యాంకుల్లో ముందుగా డీజిల్ నింపి నిల్వ ఉంచవద్దని స్పష్టం చేసింది. అలాగే బోట్ల కేబిన్ పక్కన అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. ఇవన్నీ సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షించడానికి రెండు జెట్టీలకు ఒక సాగరమిత్ర చొప్పున నియమిస్తున్నారు. వీరు రేయింబవళ్లు హార్బర్‌లో షిఫ్టుల వారీగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నారు.

బ్యానర్లు, పోస్టర్లు సిద్ధం

పోర్టు యాజమాన్యం నిర్ణయాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడానికి మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హార్బర్‌లో చేయకూడని, చేయాల్సిన పనులను పేర్కొంటూ ప్రత్యేక పోస్టర్లు, బ్యానర్లను సిద్ధం చేశారు. వీటిని హార్బర్‌లో వివిధ చోట్ల ఏర్పాటు చేస్తున్నారు. రెండ్రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. హార్బర్‌లో అగ్ని ప్రమాదాలకు తావులేకుండా పోర్టు యాజమాన్యం తీసుకుంటున్న చర్యలపై బోటు యజమానులు, కలాసీలకు మత్స్యశాఖ అధికారులు వివరిస్తున్నారు. తొలుత మత్స్యకార సంఘాల నాయకులకు, ఆ తర్వాత యజమానులు, కళాసీలకు అవగాహన కల్పించనున్నారు.

హార్బర్ బయటే సందర్శకుల వాహనాలు

హార్బర్‌కు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు చేపల రేవులో పొగ తాగడాన్ని నిషేధించిన సంగతి తెలుసుకునేలా ఆటోలపై బ్యానర్లను అతికించనున్నారు. అలాగే పర్యాటకులు, సందర్శకులు వచ్చే ఆటోలు, వాహనాలను హార్బర్ బయటే నిలిపివేయనున్నారు. చేపలరేవులోని చీకటి ప్రదేశాల్లో రాత్రి వేళ అసాంఘిక శక్తులు, తాగుబోతులు తిష్ట వేయకుండా విద్యుద్దీపాలను మరింత విస్తృతం చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలను మెరుగు పరుస్తూ కొత్తగా మరిన్ని హైపిక్సెల్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి లాల్ మహ్మద్ 'సాక్షి'కి చెప్పారు. హార్బర్‌లో నో స్మోకింగ్ నిబంధనను ఉల్లంఘిస్తే జీవీఎంసీ, పోలీస్ శాఖల సహకారంతో జరిమానా విధించే యోచన చేస్తున్నామన్నారు. హార్బర్‌లో భవిష్యత్తులో అగ్ని ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నేటి నుంచి కుల గణన

- ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ
- సిబ్బందికి ప్రజలు సహకరించాలి: కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: కులాల వారీ జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకోవడానికి.. సముచిత విధాన నిర్ణయాలు చేపట్టడానికి వీలుగా కుల గణన ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఈ నెల 19 నుంచి కులగణన చేపడుతున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో సచివాలయ సిబ్బంది ద్వారా ప్రత్యేక మొబైల్ యాప్ సహాయంతో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని పేర్కొన్నారు. ఇది వరకే ఈ సర్వేపై వివిధ వర్గాల ప్రజలు, ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి జిల్లా స్థాయి సదస్సులు నిర్వహించామని గుర్తు చేశారు. జోనల్, మండల, సచివాలయ స్థాయిలో సిబ్బంది అందరికీ ఈ సర్వేపై సమగ్ర శిక్షణ కూడా అందించినట్లు వివరించారు. వివిధ కారణాల వల్ల సర్వే వాయిదా పడిందని, శుక్రవారం నుంచి జిల్లాలో ప్రారంభవుతుందని వెల్లడించారు. సర్వేలో భాగంగా వివరాలు సేకరించే సిబ్బందికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ఓ ప్రకటన ద్వారా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత విభాగాల అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

షెడ్యూల్

- జనవరి 19 నుంచి 28 వరకు ఇంటింటా సర్వే
- జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు మిగిలిపోయిన ఇళ్లు, వ్యక్తుల వివరాల సేకరణ
- ఫిబ్రవరి 15 వరకు సచివాలయ స్థాయిలో డేటా క్రోడీకరణ, ఇతర ప్రక్రియలు..

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

రాష్ట్ర ఓటర్ల జాబితా పరిశీలకుడు శ్యామలరావు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ఓటర్ల జాబితా పరిశీలకుడు శ్యామలరావు

సాక్షి, విశాఖపట్నం : ఓటర్ల జాబితా రూపకల్పనలో పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఓటర్ల జాబితా పరిశీలకుడు, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు జిల్లా అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా యువ ఓటర్ల నమోదుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్‌వో మోహన్‌కుమార్, ఈఆర్వోలతో ఓటరు జాబితా రూపకల్పన, సవరణ ప్రక్రియపై గురువారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించారు. పక్కా జాబితాను రూపొందించేందుకు అనుసరించే విధానాలపై దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా జాబితాలను పరిశీలిస్తూ పలు అంశాలపై ఆరా తీశారు. జిల్లాలోని జనాభా, ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల నిష్పత్తి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒకే చోట ఐదుకు మించి ఉన్న పోలింగ్ స్టేషన్ల వివరాలను అడిగిన ఆయన భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఫైనల్ జాబితా ప్రచురణ కాపీలను రాజకీయ పార్టీల జిల్లా ప్రెసిడెంట్ లేదా సెక్రటరీలకు అందజేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ జాబితాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ నెల 22న ఫైనల్ లిస్టు ప్రచురించనున్న నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టామని జేసీ విశ్వనాథన్ తెలిపారు. సమీక్షలో ఈఆర్‌వోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, లక్ష్మారెడ్డి, మూర్తి, శేష శైలజ, అఖిల, ఎన్నికల సెల్ అధికారులు, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.

358 మంది పేదలకు పట్టాల అందజేత



లబ్ధిదారుడికి పట్టా అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలో బి.ఫారం స్థలాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు 388 జీవో ప్రకారం.. వారు నివసిస్తున్న భూమిపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలు(సేల్ డీడ్స్) పంపిణీ జరిగింది. అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణ మండపంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు చేతులమీదుగా వీటిని అందించారు. నియోజకవర్గంలో సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయ పరిధిలోని 148 మంది, గోపాలపట్నం తహసీల్దార్ పరిధిలోని 210 మంది లబ్ధిదారులకు మొత్తంగా 358 మందికి సేల్ డీడ్స్ అందజేసినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గం పరిధిలో ఏ మూల చూసిన గజం ధర రూ.50 వేల నుంచి లక్ష వరకు పలుకుతోందన్నారు. 358 లబ్ధిదారులకు చెందిన 25,093 గజాల భూమిని క్రమబద్ధీకరించి పూర్తి హక్కులు కల్పించినట్లు వివరించారు. ప్రభుత్వ ధర ప్రకారం ఈ స్థలాల విలువ సుమారు రూ.250 కోట్లపైనే ఉంటుందన్నారు. ప్రజలకు అన్ని విధాల మేలు చేసేలా చిత్తశుద్ధితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని.. మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు.

వృద్ధుల సంక్షేమానికి ఉమ్మడి కమిటీ

- డయల్ యువర్ సీపీ ఫిర్యాదులకు సత్వర పరిష్కారం
- వృద్ధుల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు
- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్



సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: తన కోడలు తల్లిదండ్రులతో వచ్చి తమపై దాడి చేసి కొడుకును ఇబ్బంది పెడుతున్నారని పెందుర్తికి చెందిన 61 ఏళ్ల వృద్ధుడు.. అద్దెకు ఉంటున్న వారు అద్దె చెల్లించకుండా, ఇల్లు ఖాళీ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని మహారాణిపేటకు చెందిన 72 ఏళ్ల వృద్ధుడు.. ఇలా 8 మంది వృద్ధులు వివిధ సమస్యలపై డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి ఫోన్ చేసి పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌కు నేరుగా ఫిర్యాదులు చేశారు. గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన డయల్ సీపీ కార్యక్రమానికి 31 మంది కాలర్స్ ఫోన్ చేశారు. మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల సమయంలో మొత్తం ఎనిమిది మంది వృద్ధులు ఫోన్ చేయగా సీపీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో మాట్లాడి వాటిని చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కాలర్స్ ఇచ్చిన ఫిర్యాదుల్లో భూ వివాదాలు, భార్యభర్తల గొడవలు, సివిల్ కేసులు, వ్యాపారం కోసం నగదు ఇచ్చి మోసపోయిన వారు, క్రైమ్ కేసుల విచారణ త్వరితగతిన చేయాలని, నగర ట్రాఫిక్ వంటివి ఉన్నాయి.

వృద్ధుల కోసం ప్రత్యేకంగా..

వృద్ధులకు సత్వర న్యాయం అందే దిశగా ఫిర్యాదుల స్వీకరణకు అదనంగా కేటాయించిన 30 నిమిషాల డయల్ యువర్ సీపీకి సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్ వెంకటరావు, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీమన్నారాయణలను ప్రత్యేకంగా సీపీ కార్యాలయానికి ఆహ్వానించారు. కార్యక్రమం జరుగుతున్న విధానాన్ని, వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. మరింత ఉత్తమంగా వృద్ధుల సమస్యలు పరిష్కరించే దిశగా సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్, పోలీస్ ఉన్నతాధికారులు, వృద్ధుల సంక్షేమ ఎన్‌జీఓ సంస్థలతో ఉమ్మడిగా ఒక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ఈ నెల 2న జరిగిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి 23 ఫిర్యాదులు రాగా.. వాటిలో 19 పరిష్కారమయ్యాయి. మిగిలిన 4 ఫిర్యాదులు పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు.

వాటిలో ట్రాఫిక్ సమస్యలకు సంబంధించి ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్‌లో వస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్నారని వచ్చిన ఫిర్యాదులపై ఏసీపీ స్థాయి అధికారితో దర్యాప్తు చేయించారు. ఆయా ప్రాంతాలను ప్రత్యేకంగా సందర్శించి, ప్రత్యామ్నాయ మార్గాలపై పలు ఆదేశాలు జారీ చేశారు. డయల్ యువర్ సీపీకి 0891-2523408 నెంబర్‌కు నేరుగా కాల్ చేసి సమస్యలు తెలియజేయడంతో పాటు సీపీ వాట్సాప్ నెంబర్ 9493336633కు ఫొటోలు, వీడియోలతో కూడా ఫిర్యాదులు చేయవచ్చని సీపీ సూచించారు.

14,872 మందికి రూ.90.18 లక్షల లబ్ధి

గృహ లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ విడుదల



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, గృహ నిర్మాణ లబ్ధిదారులు

మహారాణిపేట: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జిల్లాలో 14,872 మంది.. వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.90.18లక్షలు లబ్ధి పొందినట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రూ.35 వేలు చొప్పున రుణాలు పొందిన గృహ లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేశారు. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1.35 లక్షల మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇందులో 1.30 లక్షల మందికి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేశామని వివరించారు. వీటిలో ప్రస్తుతం 94 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయని చెప్పారు. ఇళ్ల నిర్మాణాల కోసం 14,872 మంది లబ్ధిదారులు వివిధ బ్యాంకుల నుంచి రూ.35,000 చొప్పున రుణాలు తీసుకున్నారని, వారికి రూ.90.18 లక్షల వడ్డీ రాయితీని వారి ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ నమూనా చెక్కును మేయర్, ఎమ్మెల్సీలతో కలిసి కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి.పాపినాయుడు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ అధికారి డి.అఖిల, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మహా ప్రసాదం

అనకాపల్లి వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు గురువారం కనులపండువగా సాగింది. మహిళలు పలు రకాల పిండివంటలు తయారు చేసి సారె ఊరేగింపును ఘనంగా జరిపారు. ఆలయంలో అమ్మవారికి సారె నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. - అనకాపల్లి

ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

మహారాణిపేట: ఉప ఖజానా(ట్రెజరీ) కార్యాలయం పరిధిలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఫిబ్రవరి 29వ తేదీలోగా జీవన ధ్రువీకరణ పత్రాలు(లైఫ్ సర్టిఫికెట్లు) అందజేయాలని జిల్లా ఖజానా అధికారి(డీటీవో) వై.సుధాకరరావు ఓ ప్రకటనలో కోరారు.

జీవన, నాన్ ఎంప్లాయిమెంట్, ఫ్యామిలీ పింఛన్‌దారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జత చేసి ఉప ఖజానా కార్యాలయం/మీ సేవ/ ఇంటర్నెట్ కేంద్రాలు/ తపాలా శాఖ ద్వారా అందజేయాలని సూచించారు. సకాలంలో జీవన ప్రమాణ పత్రాలు సమర్పించని పింఛనుదారుల పింఛన్‌ను ఏప్రిల్-2024 నుంచి నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ప్రతీ పింఛన్‌దారుడు సీతమ్మధార, భీమిలి ఉప ఖజానా కార్యాలయాలను సంప్రదించి.. ధ్రువీకరణపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

ఇస్కాన్‌కు చేరుకున్న జయద్వైత స్వామి



రాధాకృష్ణులకు పూజలు నిర్వహిస్తున్న జయద్వైతస్వామి మహారాజ్

కొమ్మాది: దక్షిణ భారతదేశ పర్యటనలో భాగంగా సనాతన ధర్మాన్ని ప్రబోధించడానికి గురువారం సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌కు జయద్వైత స్వామి మహారాజ్‌కు చేరుకున్నారు. ఆయనకు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని సాదర స్వాగతం పలికారు. ఆలయంలోని శ్రీ రాధాకృష్ణులు, జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలకు స్వామీజీ ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్ర ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కరణం కృష్ణ



విశాఖ–లీగల్: రాష్ట్ర ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కరణం కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన విశాఖ స్పెషల్ పోక్సో కోర్టులో స్పెషల్ పీపీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అనేక సంచలన పోక్సో కేసుల్లో బాధితుల తరపున నిలబడి వారికి న్యాయం జరిగేలా చూశారు. ఈ మేరకు పలువురు న్యాయవాదులు కరణం కృష్ణకు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పథంలో కేజీహెచ్

- పలు విభాగాల ఆధునికీకరణ
- అందుబాటులో రెండో క్యాజువాలిటీ

మహారాణిపేట: ఆరోగ్య ప్రదాయినిగా ఉన్న కింగ్ జార్జ్ ఆస్పత్రి ప్రగతి పథంలో పయనిస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ, సీఎస్ఆర్ నిధులు కింద ఆస్పత్రి గణనీయంగా అభివృద్ధి సాధిస్తోంది.

అధునాతన పరికరాలు

రెండో క్యాజువాలిటీని 24ఇన్‌టూ7 పద్ధతిలో సేవలందిస్తోంది. క్యాజువాలిటీలో రూ.15 లక్షలతో లేబొరేటరీ నిర్మిస్తున్నారు. అలాగే మొబైల్ ఎక్స్‌రే యూనిట్, అల్ట్రాస్కానింగ్ సిద్ధం చేశారు. సెంట్రల్ ఎయిర్ కండిషన్, పడకలు, ఆక్సిజన్, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు.

కార్డియాలజీ వార్డు..

ఆస్పత్రిలో కీలకమైన కార్డియాలజీ విభాగాన్ని పునర్నిర్మించారు. సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.24 లక్షలు కలెక్టర్ మల్లికార్జున మంజూరు చేశారు. ఈ నిధులతో కార్డియాలజీ వార్డును పునర్నిర్మించారు. గుండె జబ్బుల విభాగాన్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు.

ఓపెన్ హార్ట్ సర్జరీలు విజయవంతం

ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆపరేషన్‌కు అవసరమైన రూ. 40 లక్షల విలువగల అధునాతన పరికరం ప్రభుత్వం సమకూర్చింది.

గుండె జబ్బుల నియంత్రణకు స్టెమి ప్రాజెక్టు

అకస్మాత్తుగా వచ్చే గుండె నొప్పి బారిన పడి అనేక మంది మృత్యువాత పడుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం స్టెమి పథకాన్ని రూపొందించింది. హార్ట్ స్ట్రోక్‌లను దృష్టిలో పెట్టుకొని ఎస్‌టీ ఎలోవేషన్ మైకార్డియల్ ఇన్‌ఫ్రాక్షన్ (స్టెమీ) ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద కర్నూలు, గుంటూరు,విశాఖ ప్రాంతాల్లో ఉన్న మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉండే బోధన ఆస్పత్రుల్లో ఈ పథకం అమలు చేస్తున్నారు. వీటికి అనుబంధంగా ఉండే వైద్య విధాన పరిషత్ పరిధిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ)లో కూడా ఈ పథకం అమలు చేస్తున్నారు. దీనికి ఏపీ వైద్య విధాన పరిషత్ సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిషోర్ నోడల్ అధికారిగా నియమించారు. ప్రతి ఆస్పత్రిలో ఐసీయూ, ఆక్సిజన్, వెంటిలేటర్, ఇతర పరికరాలు కూడా ఏర్పాటు చేశారు.

120 కేవీ సోలార్ ప్రాజెక్టు



ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సోలార్ పలకలు

ఆస్పత్రిలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి అమల్లోకి తెచ్చారు. ఇప్పటికే ఉన్న సోలార్ విద్యుత్ కేజీహెచ్ మొత్తానికి సరిపోవడం లేదు. దీంతో మరో 120 కేవీతో ప్రతిపాదనలకు కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే కేజీహెచ్‌కు ఖర్చు ఆదా అవుతుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన రూ.80 లక్షల్లో సగం సీఎస్ఆర్ నుంచి ఖర్చు చేస్తున్నారు.



ఓపెన్ హార్ట్ సర్జరీ పూర్తి చేసిన తొలి రోగిని పరామర్శిస్తున్న మాజీ సూపరింటెండెంట్ శివానంద్ (ఫైల్)

పాత భవనం ఆధునికీకరణ



వార్డులో రోగుల సహాయకుల కోసం ఏర్పాటు చేసిన పడకలు

కేజీహెచ్‌లో ఉన్న పాత భవనాన్ని ఆధునికీకరించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి తన ఎంపీ, సొంత నిధులతో నిర్మించి భవనాన్ని ఇప్పుడు పునరుద్ధరించారు. సీఎస్ఆర్ నిధులతో, ఇస్కాన్ నిధులతో పునరుద్ధరిస్తున్న భవనాన్ని వినియోగంలోకి తెచ్చారు. రూ. 50 లక్షలతో ఈ భవనాన్ని ఆధునికీకరించి, అధునాతన సదుపాయాలు కల్పించారు. ఈ భవనంలో రెండు వందల పడకలు అందుబాటులోకి తెచ్చారు.

15 పడకలతో రెండో క్యాజువాలిటీ

రోగుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రస్తుతం క్యాజువాలిటిలో పడకలు సరిపోవడం లేదు. దీంతో గత సూపరింటెండెంట్ చేసిన ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో రెండో క్యాజువాలిటీ నిర్మాణానికి కలెక్టర్ మల్లికార్జున రూ.30 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఉన్న క్యాజువాలిటీ పక్కనే 15 పడకలతో రెండో క్యాజువాలిటీ నిర్మించారు.

కార్పొరేట్ స్థాయిలో..



కార్పొరేట్ ఆస్పత్రి స్థాయిలో కేజీహెచ్‌లో సదుపాయాలు, వైద్య సేవలు అందిస్తున్నాం. రోగుల సంఖ్య కూడా రోజురోజుకీ పెరుగుతోంది. గతంలో ఓపీలకు రోగులకు తక్కువగా వచ్చేవారు. నేడు నిత్యం రద్దీగా ఉంటోంది. సోమవారం అయితే 800 నుంచి 1200 మంది వరకు వస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్ల రోగులకు మంచి సేవలు అందిస్తున్నాం. రోగులకు పరీక్ష చేసి, మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నాం.

–డాక్టర్ పి.అశోక్ కుమార్, సూపరింటెండెంట్

సకాలంలో అభివృద్ధి పనులు

కేజీహెచ్‌లో అభివృద్ధి పనులు అనేకం చేపట్టాం. పనులు నిర్వహణకు వైద్యులు, వైద్యాధికారులు ఎంతో సహకారం అందించారు. ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేసింది. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాయుడు ఆధ్వర్యంలో సకాలంలో పనులు పూర్తి చేశాం.

– మన్మథరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏపీ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ, విశాఖ

ఎంతో అభివృద్ధి చేశారు



కేజీహెచ్‌లో గతంలో కంటే మెరుగైన సేవలు అందుతున్నాయి. పేదల ఆస్పత్రిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసింది. ఇటీవల అనారోగ్యంగా ఉంటే కేజీహెచ్‌కు వెళ్లా. ఓపీ టికెట్ తీసుకొని వైద్యులకు చూపించా. వైద్యులు బాగా చూశారు. పలు పరీక్షలు కూడా నిర్వహించి మందులు ఉచితంగా ఇచ్చారు.

–ఎ.సూరిబాబు, సాలిపేట

వైద్యుల స్పందన బాగుంది



కేజీహెచ్‌కు కార్పొరేట్ లుక్ వచ్చింది. పేద ప్రజల ఆస్పత్రిని ఇంతలా అభివృద్ధి చేస్తారని కలలో కూడా ఊహించలేదు. ఇటీవల నాకు అనారోగ్యంగా ఉంటే ఆస్పత్రికి వెళ్లాను. వైద్యుల స్పందన కూడా బాగుంది. వైద్యులు ఎంతో ఓపిగ్గా సమస్య విన్నారు. పరీక్షలు చేసి, వైద్యం అందజేశారు.

–డి.జగన్నాథ్, ఎగువ రెల్లివీధి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రాజు

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ ఎదురుగా గురువారం చోటుచేసుకుంది. గాజువాక ట్రాఫిక్ సీఐ పి.కోటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగవరం జాలారికాలనీకి చెందిన మద్దు రాజు (38) కన్వేయర్ బెల్టు రిపేర్ వర్క్ చేస్తుంటాడు. అతడు తన తోటి మెకానిక్ ఎం.నూకరాజుతో కలిసి గురువారం ఆటోనగర్‌లో పని నిమిత్తం శ్రీనగర్ నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. గాజువాక పోలీస్ స్టేషన్ ఎదురుగా గల కల్వర్టు వద్ద వీరి బైక్‌ను లారీ తాకింది. దీంతో బైక్ అదుపుతప్పగా వెనుక కూర్చున్న రాజు తూలి రోడ్డుపై పడి లారీ కిందకు వెళ్లిపోయాడు. లారీ చక్రాలు రాజు తలపై వెళ్లిపోవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ కోటేశ్వరరావు తెలిపారు. మృతుడు మద్దు రాజు కాకినాడ దూపాలపేట గ్రామం నుంచి ఉపాధి కోసం వచ్చి గంగవరం వద్ద జాలారికాలనీలో స్థిరపడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బాలుడిని మింగేసిన సెప్టిక్ ట్యాంక్





కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి పార్వతి (ఇన్‌సెట్) మృతి చెందిన కౌషిక్(ఫైల్)

ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సంక్రాంతి పండగకు పెద్దమ్మ ఇంటికి వచ్చిన బాలుడు ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో జారి పడి దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ గంట్యాడ సంతోష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమలాపురానికి చెందిన ఉప్పాడ పార్వతి భర్త జగన్ కొన్నాళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆమె బతుకు తెరువు కోసం తన ఒక్కగానొక్క కుమారుడు కౌషిక్ వికాస్‌తో కలిసి ఏడాది క్రితం మధురవాడ సమీపంలోని వాంబే కాలనీకి వలస వచ్చింది. అక్కడ రోజువారీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. కౌషిక్ వికాస్ పెద్దమ్మ కుమారి మండలంలోని వెల్లంకి ఎస్సీ కాలనీలో కుటుంబంతో ఉంటోంది. ఇదిలా ఉండగా కౌషిక్ వికాస్(7) సంక్రాంతి పండగకని వెల్లంకిలోని పెద్దమ్మ ఇంటికి మూడు రోజులు క్రితం వచ్చాడు. గురువారం ఉదయం ఆడుకోవడానికి పిల్లలతో బయటకు వెళ్లాడు. అలా వెళ్లిన కౌషిక్ వికాస్ ఎంతకీ ఇంటికి రాక పోవడంతో పెద్దమ్మ కుమారితో పాటు చుట్టు పక్కల వారు వెదికారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. ఈలోగా సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంటి పరిసరాలను పరిశీలించారు. నీటితో ఉన్న మూతలేని సెప్టిక్ ట్యాంక్‌లో బాలుడు మృతదేహం కనిపించింది. ఈ మేరకు తల్లి పార్వతికి, పోలీసులకు కుమారి సమాచారం అందించింది. ఎస్ఐ గంట్యాడ సంతోష్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, కుమారుడు అకాలంగా మృత్యువాత పడడంతో ఇంకా తనకు దిక్కెవరంటూ కౌషిక్ వికాస్ తల్లి పార్వతి రోదిస్తున్న తీరు పలువురిని కంట తడి పెట్టించింది.

27న రైతు బజార్‌లో రైతుల కోసం డ్రా

మహారాణిపేట: ఈనెల 27న విశాఖ కలెక్టర్ కార్యాలయంలో రైతు బజార్ స్టాల్స్ కోసం డ్రా నిర్వహించనున్నారు. 2019 నుంచి నేటి వరకు రైతు బజార్‌ల్లో స్టాల్స్ కోసం 786 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 235 మంది రైతులకు ఈనెల 12న డ్రా తీసినట్టు జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. 80 మంది గిరిజన రైతులు రాకపోవడంతో వారి కోసం ఈనెల 27న డ్రా తీయనున్నట్టు ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 235 మంది రైతుల వివరాలు, డ్రా తీయనున్న స్టాల్స్ వివరాలు www.visakhapatnam. ap.gov.inలలో పొందుపరిచినట్టు జేసీ వివరించారు. ఎంపికైన రైతులకు నామినీగా ఉండడానికి వారి రక్త సంబంధికులకు మాత్రమే అనుమతించడం జరుగుతుందని, ఆ రైతులు సాయంత్రం పూట రైతు బజార్లకు వెళ్లడానికి అంగీకారం తెలపవలసి ఉందని స్పష్టం చేశారు. వివరాలకు 9959592474కు సంప్రదించాలని జేసీ విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



బైపా అరుణ్‌కుమార్

డాబాగార్డెన్స్: విజయవాడ నడిబొడ్డున ఈ నెల 19న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణకు విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న దళితులు, అంబేడ్కరీయులు పెద్ద ఎత్తున తరలిరావాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, దళిత నాయకుడు, సీనియర్ న్యాయవాది బైపా అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బీఏకే చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంకితం చేస్తున్న ఈ కార్యక్రమానికి దళితులు, దళిత నాయకులు, దళిత సంఘాలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సామాజిక వర్గాలంతా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలపాలన్నారు. రాష్ట్రంలో 7 వేల మంది వరకు షెడ్యూల్డ్ కులాల న్యాయవాదులున్నారని, వీరంతా విజయవాడకు తరలిరావాలని కోరారు. అంతేగాక పాయకరావుపేట ఎస్సీ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో 55వ వార్డు కార్పొరేటర్ కేవీఎన్ శశికళ, వైఎస్సార్ సీపీ క్రియాశీలక సభ్యుడు నాగుపల్లి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణంతో ఆర్టీసీపై నమ్మకం

- డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సుధాబిందు



సమావేశంలో మాట్లాడుతున్న సుధాబిందు

అనకాపల్లి: రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ) విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సీటీఎం సుధాబిందు చెప్పారు. స్థానిక ఆర్టీసీ గ్యారేజీ ఆవరణలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఉత్సవాలను ఫిబ్రవరి 14వ తేదీ వరకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. జీరో రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లు, మెకానిక్‌లు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం వలన ఆర్టీసీపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లతోపాటు మెకానిక్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. జోన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మాసోత్సవాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చామన్నారు. డిపో మేనేజర్ సుజాత, ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్ర, ఆర్టీసీ సెక్యూరిటీ సబ్ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు, సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీనివాస్ నిరాహార దీక్ష చేయలేదు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న జనుపల్లి శ్రీనివాస్ నిరాహార దీక్ష చేయడంలేదని జైల్ పర్యవేక్షణాధికారి కిశోర్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ తీసుకొన్నట్లు తెలిపారు. రాత్రి భోజనం కూడా అందరి ఖైదీలు మాదిరిగా శ్రీనివాస్‌కు కూడా సిబ్బంది సరఫరా చేసినట్లు తెలిపారు. శ్రీనివాస్ దీక్ష చేపడతానని మౌఖికంగా గురువారం తెలిపాడన్నారు. కానీ జైలు నిబంధనల ప్రకారం లోపల నిరాహార దీక్ష చేయకూడదని నచ్చజెప్పి అనుమతి ఇవ్వలేదన్నారు.

దళిత సంఘాల నిరసన

విశాఖ కేంద్ర కారాగారంలో కోడి కత్తి కేసులో రిమాండ్‌లో ఉన్న శ్రీనివాస్‌కు న్యాయం చేయాలని కోరుతూ విశాఖ దళిత సంఘాల సమాఖ్య(విదసం) సభ్యులు గురువారం నిరసన తెలిపారు. ములాఖత్‌లో శ్రీనివాస్‌తో మాట్లాడిన అనంతరం జైలు బయట ప్లకార్డులతో నిరసన తెలియజేసినట్లు విదసం రాష్ట్ర సమన్వయకర్త బూసి వెంకటరావు, ఇతర సభ్యులు తెలిపారు.

ఆదాయ పన్నుల శాఖ పీపీగా శ్రీనివాస్



శ్రీనివాస్

విశాఖలీగల్: ఆదాయ పన్నుల శాఖ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నగరానికి చెందిన వై.ఎస్.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదాయ పన్నుల శాఖ న్యాయవిభాగం కమిషనర్ శాలిని భార్గవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారు. శ్రీనివాస్ ఇప్పటికే పరోక్ష పన్నుల విభాగం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు విశాఖ న్యాయవాదులు సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామ జోగేశ్వరరావు, సీనియర్ సభ్యుడు ఎస్.కృష్ణమోహన్, ఎస్.శ్రీనివాస్‌మూర్తి అభినందించారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.62,620
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,400
వెండి(కిలో):	రూ.77,000

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	:రూ.115
స్కిన్	:రూ.200
స్కిన్‌లెస్	:రూ.210